


# జీవన సంధ్యాసమయంలో...

శ్రీమధురాజ్

ఊరింకా నిద్రపోలేదు.

కనుచీకటి పడ్డ తరువాత గుడిసెల్లో నుండి లేచిన పొగలు చీకటిమాటున ఆగిపోయి అప్పటికి చాలసేపయ్యింది. ఊరవతల టూరింగు సినిమా టెంటులో అరిగిపోయిన రికార్డు గరగరలాడుతూ పాటలు పాడుతోంది. చీకట్లో వీధులకడ్డంగా పరుగెడుతున్న బురదపందుల్ని చూసి ఊరకుక్కలు వూరికే 'గీ' మని గోలపెడుతున్నాయి. వాడలోని వీధిలైట్లు వాడలోని వ్యక్తుల జీవితాల్లా 'వెలగమా మానమా' అన్నట్లు– యిక్కడోటి అక్కడోటి చీకటిని చూసి దడుసుకున్నట్లు మిణుకు మిణుకు మంటున్నాయి.

అది హరిజనవాడలో అన్నాలవేళ.

సూర్యుడి కంటే ముందేలేచి — అతడితోపాటు వురికి వురికి — రక్తాన్ని చెమటలుగా గ్రక్కి, అతను గూటికి చేరుకున్నాకే గుడిసెలకు చేరుకున్న కూలీ జనం — మండీ మండని పొయ్యిమీద — ఉడికీ వుడకనిది యింత వండుక — వడ్డించుక తినే వేళ.

సన్నాసి పక్కీరయ్య అడుక్కు తెచ్చుకున్న కూడు ఎప్పుడు తిన్నాడో ఏమో — అప్పుడే తత్వాలు పాడుతున్నాడు 'రాములోరి' గుడి దగ్గర. ఆ వాతావరణానికి పక్కీరయ్య గొంతుశోక సంగీతంలా వుంది.

రాములోరి గుడికి కాస్తంత అటుప్రక్కన మున్న నాలుగు నిట్టాళ్ల ఈతాకుల కొట్టము నారాయణదే. ఇప్పుడైతే వయసు పైబడి, కాలికి పక్షవాతమొచ్చి అలా రెక్కలిరిగిన పక్షిలా వున్నాడే కాని — మొన్న మొన్నటిదాకా తన రెక్కల్ని ముక్కలు చేసుకొని, తన కండల్ని పిండి చేసుకొని — ఒంటి నిట్టాడి కొట్టాన్ని నాలుగు నిట్టాళ్లకు పెంచాడు. చేరెడు నేలను రెండెకరాలు చేశాడు. ఇద్దరి బిడ్డల్ని అత్తారింటికంపాడు. మరో యిద్దరు కొడుకుల్ని కలో గంజో త్రాగి పెంచి పెద్దచేసి ప్రయోజకుల్ని చేశాడు. ఇదంతా నారాయణ ఒక్కడే తన రెక్కల కష్టంతోనే సాధించాడూ అంటే — అంతకంటే అబద్ధం మరోటుండదు. కట్టుకున్న యిల్లాలు నాగమ్మ లేకుంటే నారాయణ— నాలుగు నిట్టాళ్లూ, రెండెకరాలు కాదు కదా — ఉన్న ఒంటి నిట్టాడి చేరెడు నేల ఏనాడో పోగొట్టుకొని ఉండేవాడు.

నారాయణా,నాగమ్మ సూర్యునితో పోటీపడ్డారు.

ఆలుమగలూ వర్షంతోనూ తలపడ్డారు.

ఆ పెళ్లాం, మగడూ చలితోనూ పంతం పడ్డారు.

కాలానికైతే ఎంతవురికినా ఆయాసం లేదేమో కాని — మనుషులెన్నాళ్లు కాలంతో పోటీపడగలరు ?

ఇప్పుడు అరవైపదులు నిండిన నారాయణకు— పరుగెత్తటానికి కాదుకదా — నడవటానిక్కూడా ఓ కాలు సరిగాలేదు. దాన్ని పక్షవాతం మింగేసింది. ఇక ఐదున్నరపదులు నిండిన నాగమ్మకు — కొండల్ని పిండి కొట్టటానిక్కాదు కదా— కనీస శ్రమకు తట్టుకోటానికి తగిన శక్తికూడా లేదు. శక్తిని వయసు మింగేసింది.

అదిగో నారాయణ ఇల్లు...

* * *

ఆ యిల్లు యిప్పుడు నారాయిణది కాదు నిజానికి. కుడివైపున్న రెండు నిట్టాళ్ల కొట్టం పెద్దకొడుకు నాగసుబ్బడిది. మరి ఎడమవైపుది చిన్నకొడుకు రామలింగడిది.

నారాయణ యింట్లోనుండి బయటకొచ్చాడు నెమ్మదిగా కర్రసాయంతో. ఆకాశంకేసి తలెత్తి చూశాడు. చుక్కలు నిండిన ఆకాశం తన్ను వెక్కిరించినట్లయి తలదించుకున్నాడు. ఇంట్లోని బుడ్డి దీపం గుడ్డి వెలుగు తడిక సందుల్లోంచి బయటికి పడుతూంది. ఆ చీకటి వెలుగులు కట్లపాముల్లా వున్నాయి.

నారాయణ గుండెల్లో బాధ సుళ్లు తిరుగుతోంది. దుఃఖంతో శరీరం సన్నగా వణుకుతోంది. కళ్లు వర్షించటానికి సిద్ధంగావున్న మేఘాల్లా వున్నాయి. అయినా తనేం తప్పు చేశాడు? తనేం పాపం చేశాడు ? ? మాటల ఈటెలతో తన గుండెల్ని ఎందుకిలా తూట్లు తూట్లుగా పొడుస్తున్నారు. నారాయణ కళ్లు తుడుచుకున్నాడు. ఏడుపు బయటకు రాకుండా పెదవి బిగబెట్టుకున్నాడు.

అప్పటికి సరిగ్గా అరగంట క్రితం ఆ యింట్లో దృశ్యం యిలా వుంది —

'అమ్మో — అమ్మో — గూట్లో యెట్టిన కుండెడు సద్దికూడు ఈ ముసలాడే మెక్కేసినట్టున్నాడు — కుండలో మెతుకూలేదు — అది కడుపా సెరువా నాయనో ! యింటి దగ్గరున్న ఈ సంటి ముండకయినా యింత పెట్టిండో— లేకుంటే అంతా తన కడుపుకే పాముకున్నాడో—' కోడలు కోటమ్మ యింట్లో కాలుపెడుతూనే యిల్లంటుకున్నట్లుగా గోలపెట్టింది. బయట అరుగుమీద కూర్చుని బీడి కాల్చుకుంటున్న నారాయణ గుండెల్లో ఈ మాటలు తూట్లు పొడిచాయి ఒక్క క్షణం శరీరం కోపంతో కుత కుత లాడింది. కాని— మరుక్షణమే తానేమిటో గుర్తుకు వచ్చి, మనసు మూగగా మూల్గింది.

'ఒసేయ్! వూరకే ముసలాన్నెందుకు ఆడిపోసుకుంటావే–' కొడుకు నాగసుబ్బడు తండ్రిని కాపాడాలనుకుంటున్నాడు పెళ్లాం నోటినుండి.

'ఇగో– మీ నాయనంటే నీకంత యిదుంటే వున్న ఆ ఒక్కెకరాన్ని అమ్ముకోని కుండెడు కుండెడు కూడొండి పెట్టు– నేను న్నా పిల్లలు సెర్లో దూకి సత్తాము–' చేతులు సాపి మెటికలు విరిచింది కసిగా.

ముసలి నారాయణ యిక బయట నిలువలేక యింట్లో కొచ్చాడు. కోడలు కోటమ్మ త్రాచు పాములా బుసలుకొడుతోంది. కొడుకు నాగసుబ్బడు మన్ను తిన్న పాములా మౌనంగా వున్నాడు. పిల్లలు బిక్కు బిక్కున చూస్తున్నారు తాతను, తల్లిని.

'వొరే నాగసుబ్బా! మద్దినాల నాలుగు ముద్దల్తిని బయటరుగుమీద తొంగున్నాను. మన సంటిది, బుడ్డోడు వాకిట్ల ఆడుకుంటునే వున్నరు. యెప్పుడొచ్చి సచ్చిందో యేటో కర్రికుక్క గూట్లో కుండలోని కూడు పొట్టనెట్టక సక్కావోయింది– కాదటే సంటీ...' నారాయణ ఐదారేళ్ల సంటిదాని సాక్ష్యం కోసం ఆతురతతో చూశాడు. సంటిది ఔననలేదు– కాదనలేదు.

కోటమ్మ గయ్యిమని లేచింది రేచుకుక్కలా.

'ఆ సంటిదాన్నెందుకు అబద్ధాలు సెప్పిత్తావు – యియ్యాల కర్రికుక్క తినిందంటున్నావు... నిన్న తెల్ల పిల్లి బొక్కిందంటివి – యిగరేపు– 'వొరే కొడుకో! ఆ కుండలో నీ పెల్లం ముండ నాలుగంటే నాలుగు ముద్దల కూడెట్టి నన్నాకటితో సంపుతుందిరో'' అంటవు – యింకెన్నాల్లుందో మాకీ ముదనష్టపు ముసలిపీడ–'' రక్కున మళ్లీ మెటికలు విరిచింది.

నారాయణ గుండె ఒక్క క్షణమాగిపోయింది ఆ మాటతో.

ముసలి మనసు మూగబాధతో మూలిగింది. కళ్ల నీళ్లతో దీనంగా కొడుకువైపు చూశాడు. ఇదంతా తనకేమీ పట్టనట్లుగా తాపీగా బీడి కాల్చుకుంటున్నాడు నాగసుబ్బడు.

నారాయణ తినే నాలుగు మెతుకులకూ ప్రతిరోజూ ఈ యుద్ధం తప్పదు. కొడుకూ, కోడలూ చేసే ఈ అవమానాలకు, పదే పదే అనే సూటి మాటలకూ మనసు నలిగిన ముసలి నారాయణ– 'ఛీ... ఛీ.. యీ కూడు తినకుంటేనేం ...' అని ముసుగేసుకపడుకుంటాడు. కానీ – ఎంతసేపు పడుకుంటాడు?

ఆకలి ... ఆకలి ... నీరసం ... ఆకలి.

చచ్చేదాకా తినాలి తప్పదు. ఎన్ని అవమానాలున్నా దిగమింగుక తినాలి ఎన్నెన్ని ఈసడింపులున్నా దిగతుడుచుక తినాలి. తప్పదుగాక తప్పదు. అందుకే నారాయణ తింటున్నాడు కోడులు, కొడుకుల తిట్లు, శాపనార్థాలు దీవెనలుగా భావించుకుని.

కోటమ్మ యింకా గొణుక్కుంటునే వుంది వంటచేస్తూ. కోడిమీద, కుక్కమీద పెట్టి నారాయణను తిడుతూనేవుంది. అవన్నీ తనకేనని తెలిసినా నారాయణ గుమ్మునుంటాడు. పేదవాడి కోపం పామెత నారాయణకు బాగా తెలుసు.

కర్ర సాయంతో నారాయణ బయటరుగుమీదకు వచ్చాడు.

## జీవన సంధ్యాసమయంలో...

సరిగ్గా అప్పుడు ఎడమప్రక్క – చిన్నకొడుకు రామలింగడి యింట్లో ...

* * *

చీకటి పడీపడకుండానే రామలింగం యింట్లో కడుగుపెట్టాడు. వస్తూనే నిప్పులు చెరుగుతూ ముసలి తల్లి నాగమ్మమీద విరుచుకపడ్డాడు. గొంతు చించుకుంటూ శివమెత్తినవాడిలా కేకలేస్తున్నాడు.

'ఏమేవ్! నీకు బుద్ధుందా లేదా – కడుపుకేం తింటావేనువ్. పొద్దుటాల నువ్వు పన్లోకెల్లేటప్పుడు మాయమ్మనుగూడ పిల్సుకెల్లమని పెద్దరెడ్డి సెప్పిండు కదే – మరేం పొయ్యేకాలం నీకు మాయమ్మ నింటికాడ వొగ్గేసి వొక్కత్తివి పన్లోకి పోయొచ్చినవ్. అటువోయి సూడు పెద్దరెడ్డి యింతెత్తున యెగురుతున్నడు.'

'నన్నడుగుతావేం – అగో ఆడమంచంలో మారానీలాగ తొంగుంది సూడు మీయమ్మనడుగు... పెల్లాలమీద కయితే వొంటి కాల్మీదవస్తరు ... నీ నోరక్కడ సూయించు ...' పెళ్లాం రామలింగన్ని ఝాడించింది.

'వొరే రామలింగం! జొరమింకా తగ్గలేదురా– లేస్తే నీర్సంతో కళ్లు తిరుగుతున్నయి. అందుకే నీ పెల్లం పన్లోకి రమ్మన్నా రాలేక తొంగున్నా –' నూతిలో నుండి మాట్లాడినట్లుగా నాగమ్మ జవాబిచ్చింది. జ్వరంతో ఒళ్లింకా కాలిపోతూనేవుంది ఓ మందా? మాకా?

ఇంకా పనికి పోలేదేనని కొడుకు, కోడలు పోరుతునేవుంటే!

'అవతల నాలుగేసి రూపాయల కూలీల్దొరుకుతుంటే, జొరమని ముసుగేసుక మూలన పడుకుంటే గంజినీళ్లెట్లా వస్తయి– మనమేం మారాజులమా? రేపు నోరెత్తకుండా పన్లోకిపో –'

'కుసింత తగ్గిందంటే పోనట్రా సిన్నోడా –' ఆ ముసలి తల్లి కంఠంలో ఆప్యాయత, మార్దవం, ప్రేమ. కన్నకొడుకిలా కసరుతున్నందుకు మాటల కందని బాధ.

తల్లి మాటకు రామలింగం భగ్గుమన్నాడు.

'ఇగోనేవ్! ఈ యింట్లో పనికిపోకుండా మారానిలా మంచాలెక్కి పడుకుంటే గంజినీళ్లు కూడ పొయ్యన్నాడు – అట్లాగే ఆకల్తో చావాల్సిందే – ఏమేవ్! నీకే సెపుతున్నా – వినపడిందా?–' గొంతెత్తి కేకలేస్తూ రామలింగం విసురుగా బయటకి వెళ్లాడు.

ముసలి నాగమ్మ గుండె భగ్గున మండింది, కోపంతో మనసు కుతకుత వుడికింది. కొడుకు చెప్పిన హెచ్చరికలు పెళ్లానికి కాదు – తనకని తెలుసుకోలేనంతటి మూర్ఖురాలు కాదు – అనుభవాలతో పండిన ముసలి నాగమ్మ.

కొడుకు ... కన్నకొడుకు

అష్టకష్టాలుపడి కనిపెంచిన కడుపుపంట ... జ్వరమొచ్చిన కన్నతల్లికి మందు మాకులిప్పించకున్నా– పట్టెడు మెతుకులు పెట్టలేని కొడుకు –

ముసలితల్లి గుండెల్లో మాటల ఈటలతో తూట్లుపొడుస్తున్న కన్నకొడుకు –

ఆపుకుందామన్నా ఆగనికన్నీళ్లు ముడతలుపడ ఆ చెంపల్ని తడిపాయి పదే పదే .....

* * *

హరిజనవాడ నిద్రలోకి జారుకుంటోంది

ఉండివుండి వూరకుక్కలు వూరికే చీకట్లోకి చూసి వికృతంగా మొరుగుతున్నాయి ఊరవతల సినిమాటెంటు మైకు పాటలు పాడటంలేదు సినిమా మొదలయ్యిందన్నమాట పిచ్చిసన్యాసి పక్కీరయ్య తత్వాలు పాడి పాడి – యిప్పడూరికే చీకట్లోకి చూస్తున్నాడు పిచ్చిగా

పెద్దోడి కొట్టంముందు అరుగుమీద ముసలి తండ్రి నారాయణ

చిన్నోడి కొట్టంముందు అరుగుమీద ముసలి తల్లి నాగమ్మ.

నారాయణ మీద పెద్ద కోడలు యెగిరెగిరి పడుతున్నపుడు నాగమ్మ మౌనంగా కన్నీళ్లతో వింటునే వుంది. నాగమ్మమీద చిన్న కొడుకు గొంతు చించుకుంటున్నపుడు నారాయణ గుబులుగుబులుగా వింటునే వున్నాడు.

ఇండ్లలో కొడుకులు, కోడళ్లు వెచ్చగా పడుకన్నారు.

ఎముకల్ని కొరుక్కుతినే చలికి ముసలి దేహాల్ని ఆహారంగా వదేశారు, కడుపు చించుక పుట్టినవారు

నారాయణ మెల్లగా నాగమ్మ అరుగు దగ్గరకు వచ్చాడు. ప్రక్కలో కూర్చుని నాగమ్మ వీపు నిమిరాడు మెల్లగా.

ఆ స్పర్శలో ఆప్యాయత.

ఆ స్పర్శలో నిస్సహాయత.

కవులు వర్ణించలేని, భావుకులు ఊహించలేని, రచయితలు చిత్రించలేని ఎన్నెన్ని భావనలో ఆ స్పర్శలో.

నాగమ్మ మనసు పులకించింది. ఒక్క క్షణం నీరసం ఎగిరిపోయినట్లయింది. పాతికేళ్లు వెనక్కు పరుగెత్తింది మనసు. ఎన్నెన్ని బాధల్ను, కష్టాల్ను మరపింప చేసిందీ ఆ చేతి స్పర్శ.

ఉబుకుతున్న నారాయణ కన్నీటిని కొనగోట తుడిచింది నాగమ్మ. మాటా పలుకు లేకుండా ఒకర్నొకరు మౌనంగా ఓదార్చుకున్నారు ఆ ముసలి దంపతులు.

ఎవ్వరూ తమ తమ కష్టాలు, అవమానాలు, కన్నీళ్లు కలబోసుకోలేదు.

ఎవ్వరూ తమ తమ కథలూ, గాథలూ తవ్వుకోలేదు.

'ఏమేవ్! నా మనసంతా అదోలాగుంది కూసింత ఆ పంతులోరింటికాడికెల్తొత్తాను ఇగో నా పాత కంబడి... యిది కూడా నిండా కప్పక తొంగో యెచ్చగుంటాది... పొద్దుటాలకు జొరం తగ్గుతది కూడా-'

నారాయణ కర్రసాయంతో ఆంథోని పంతులింటికేసి నడిచాడు. ఆంథోని గత పాతికేళ్లుగా ఎలిమెంటరీ స్కూలు పంతులుగా ఆ వాడ స్కూల్లో పనిచేసి, అక్కడే రిటైరయ్యాడు.

'ఏం నారాయణా! రారా – యింకా నిద్ర పట్టలా–' ఆంథోని మంచం మీద కూర్చుని బైబిలు చదువుతూ ఆహ్వానించాడు.

'ముసలోన్ని నా కంత తొందరగా నిద్దర పట్టు

ద్దంటారా పంతులోరు' నారాయణ అరుగుమీద కూర్చున్నాడు.

'ఏంటి సంగతులు ?' బైబిలు మూస్తూ అడిగాడు ఆంథోని.

'సావెప్పుడొత్తుందా అని అంతా యెదురు సూత్తుండారు — అంతకంటె కొత్త సంగతే ఈ ముసలోడికుంటది పంతులూ —' ఈ మాటలంటున్నపుడు నారాయణ కంఠం బొంగురుపోయింది

'అదేంటి నారాయణా ! అలాగంటవు. నేను మాత్రం ముసలోడినికానా ?'

'మీకేటి పంతులూ — అదురుట్టవంతులు ఉన్న ముగ్గురు కొడుకులూ రాజాల్లాగా వుద్దోగాల్లో వున్నారు. అళ్లు మీమీద పేమతో రారమ్మంటూ రోజూ జాబులు రాత్తుండారు. మీరేమో యెందుకో పోకుండా యిక్కన్నే వుంటున్నరు. ఇదిగో నా మాటిని మీరిద్దరూ ఈ ముసలిపాయంలో కొడుకుల్దగ్గరికెళ్లండి.'

ఆంథోని నారాయణ సలహాకు బదులివ్వకుండా— నిర్జీవంగా నవ్వాడు.

ఆ చీకట్లో ఒక్కక్షణం నిశ్శబ్దం.

'ఇది నువ్వు రోజూ చెప్పేసంగతేకాని—నాగమ్మకు జ్వరమెలాగుంది.'

'ఆ సంగజ్జెప్పటానికే ఈడకొచ్చినా. తెల్లారి మీరు దాని మందులకో రెండ్రూపాయలివ్వాల—మళ్లీ యిచ్చేత్తా.'

'అదేం ? రామలింగడు మాత్రలు తీసుకరాలేదా ?'

పంతులుగారి మాటకు నారాయణ పకీపకీ నవ్వాడు.

'మందులా మసనకాడా ? తెల్లారి పన్లోకి పోకుండా జొరమని తొంగుంటే గంజికూడా పోయనని తెగేసి సెప్పిండు మా లింగంగాడు. మరి మీరేటో మాయలోకంలో వుండారు.'

ఆంథోని మరి మాట్లాడలేదు. నారాయణే ఏవో చెపుతున్నాడు.

సరిగ్గా అప్పుడు — చిన్నోడి యింటి ముందు అరుగుమీద జ్వరంతో, చలితో వణుకుతూ పడుకున్న నాగమ్మ మనసు పదిహేనేళ్ల వెనక్కు వెళ్లింది.

* * *

రెండు నిట్టాళ్ల కొట్టంలో, కుక్కిమంచంలో పడుకొని, కొట్టం చూరువంక చూస్తున్నాడు రామలింగడు.

పదిహేనేళ్ల రామలింగడు అరవైఏళ్ల ముసలివానిలాగున్నాడు. అస్థిపంజరానికి చర్మం తొడిగినట్లుగావున్నాడు. చూపుల్లో శూన్యం తప్ప జీవంలేదు. పలకరిస్తే నూతిలోనుండి మాట్లాడినట్లుగా జవాబు. అతికష్టంమీద తప్ప మంచంలో లేచికూర్చోలేదు.

నీరసం ... బలహీనత.

ఖణేల్ ... ఖణేల్ ... ఖణేల్ ...

దగ్గుతో ఎండిన రొమ్ములు యెగిసెగిసిపడుతున్నాయి. ఊపిరి పీల్చుకోవటం కూడ కష్టంగా వుంది. చిన్నగా మొదలయిన దగ్గు, జ్వరం క్రమంగా క్షయగా మారి రామలింగాన్ని పూర్తిగా కబళించటానికి సిద్ధంగా వుంది.

మృత్యువు వాకిట్లో నిరీక్షిస్తోంది విసుగ్గా.

నాగమ్మ కొడుకువంక కన్నార్పకుండా చూస్తోంది.

ఆడుతూ పాడుతూ పనీపాట చేయాల్సిన చేతికందిన కొడుకు — ఇలా మృత్యుముఖంలో రోజులు లెక్కబెడుతూ —

కన్నతల్లి కళ్లు శ్రావణ మేఘాలయ్యాయి.

కన్నతల్లి గుండెలు భయంతో గుబ గుబమంటున్నాయి.

ప్రపంచంలోని ఏ శక్తినైనా కొడుకు బాధను తనకు బదలాయిస్తే ఆనందంగా స్వీకరించగలదామె.

ఆ కన్నతల్లి హృదయం ఈ అక్షరాలకు అందగలదా ? !

నారాయణ వచ్చాడు. కొడుకుకోసం అణువణువులో తహతహ.

'ఎలాగుంది పిలగానికి —'

'అట్టానే వుంది—' నాగమ్మ కళ్లు వర్షించటానికి సిద్ధంగా వున్నాయి.

'వూర్లో ఆచారిగోరి వైజ్జం కుదిరినట్లుగలేదు—పట్నంలో పెద్ద డాకటరుకు సూయిస్తే...!' ఆశ. అందని ఆశ. అందుకోవాలని ఆశ. కన్న కడుపును దక్కించుకోవాలని ఆశ.

పట్నం — డాక్టరు — వైద్యం.

డబ్బు — డబ్బు — డబ్బు.

నారాయణ నాగమ్మ ఒకర్నొకరు మౌనంగా చూసుకున్నారు. ఆ చూపులు ఏం మాట్లాడుకున్నాయో — నారాయణకేం అర్థమయ్యిందో - వెంటనే లేచివెళ్లాడు

రామలింగాన్ని ప్రొద్దున్నే పట్నం తీసికెళ్ళారు

సరిగ్గా మూడు నెలలకు రామలింగడు మామూలు మనిషయ్యాడు.

నాగమ్మకళ్లు ఆనందంతో మెరిశాయి.

నారాయణ మనసు సంతోషంతో గెంతింది

కానీ—

రామలింగని ఆరోగ్యం ఖరీదు చెల్లించటానికి-

నారాయణ వరుసగా పదేళ్లు పెద్దరెడ్డి యింట్లో పాలేరుగా వున్నాడు రెక్కలు ముక్కలు చేసుకున్నాడు.

నాగమ్మ నడుమెత్తకుండా వీధి వీధి తిరిగి పశువుల పేడ పోగుచేసింది.

పెద్దరెడ్డి యింట్లో, పొలంలో రక్తాన్ని చెమటలుగా చిందించింది

మరి యిప్పుడా ముసలి తల్లికి జ్వరమొస్తే. . వొస్తే ... ? ? ! !

... ... ఎంతగా ముణగదీసుకొని పడుకున్నా డిసెంబరు చలి ఎముకల్ని కొరికేస్తునే వుంది.

నాగమ్మ మూటగట్టి అరుగుమీద పడేసిన మనిషిలా వుంది. మెల్లగా ఈదురుగాలి మొదలయ్యింది. ఇహ పడుకోవటం సాధ్యంకాక, లేచి కూర్చుని ఆర్పిదాచుకున్న బీడీముక్కను ముట్టించాడు నారాయణ. పొగ గుండెల్ని తగిలేలా పీల్చేసరికి శరీరం కొంచెం వేడెక్కింది.

తెల్లవారు ఝాము కోడి కూసింది.


ఇంట్లో కొడుకు, కోడలు నిద్రలేచినట్లున్నారు— ఏదో గుసగుసగా మాట్లాడుకుంటున్నారు.


'కిస్‌మసు పండుగ యింగా యెన్నాల్లుందే—' కోడలు గొంతు.

'యేందే పండగకు మా తొందరదుతున్నావులాగుంది—' కొడుకు.

'ఆఁ! గార్లుబూర్లు కడుపుకు తిందామని. నీ తెలివి తెల్లారినట్టే వుంది — ఈ పండక్కి కాదూ మీ ముసలోడు సిన్నకొడుకింటికి, ముసల్దిమవింటికి మారేది—'

'అవునేవ్ మర్చిన. ఇగ ముసలోడికి తిండి దండగ తప్పేతదంటావ్'— కన్నకొడుకు.



## జీవన సంధ్యాసమయంలో...

'అవిటోడు కలోగంజో తాగి గమ్మునుండక రుసులు కోరుతుంటడు. పైగా నలుగురంత తనొక్కడే తింటడు.. యాడాడి నూకలు యీడి తిండికే సాలటంలా—'

'ఆ ముసల్దే మేలు కూలికెల్లి నాల్గురూపా యలన్నా తెస్తది'—

వినిపించకుండా గుసగుసలు. కోడలు యేం చెప్పిందో ఏమో కొడుకు పకపక నవ్వుతున్నాడు. ఆ నిశ్శబ్ద వాతావరణంలో ఆ నవ్వు దయ్యం పగల బడి నవ్వినట్లుగా వుంది. అంత చలిలోనూ కొడుకు కోడళ్లమాటలు నారాయణకు చెమటలు తెప్పించాయి.

తన్ను తానే 'ఛీ' అనుకున్నాడు.

'సామీ నన్నెందుకింకా బతికించినవ్. సవ్వన సంపుకపోక' ఏడుస్తూ ఆకాశంకేసి దండం పెట్టు కున్నాడు.

బీడీ విసిరేసి కళ్లు మూసుకున్నాడు. చెవుల్లో ఆ మాటలు. నవ్వులే గింగిరుమంటున్నాయి.

అవును నిరుడు సరిగ్గా క్రిస్టమస్ పండుగ రోజే పంపకాలు జరిగాయి.

ఆ రోజు ...

* * *

రచ్చబండమీద పెద్దరెడ్డి, రమణయ్య, ముత్యాలశెట్టిగారలు గంభీరంగా కూర్చున్నారు — న్యాయాధికారుల దర్జాతో. ఆ వూళ్లో వారేం చెబితే అదే న్యాయమూ, చట్టమూ. రచ్చబండ క్రింద పెద్దకొడుకు నాగసుబ్బడు, చిన్నకొడుకు రామలింగడూ చెరో ప్రక్కకూ కూచున్నారు — చూపులతో చురచుర చూసుకుంటూ. నారాయణ, నాగమ్మ క్రింద నేలమీద కూచున్నారు — కళ్లనుండి దుముకటానికి సిద్ధంగావున్న కన్నీళ్లను ఆపుకుంటూ. ఊరికే వెర్రిగా కొడుకులిద్దర్నీ చూస్తున్నారు.

నారాయణ రెండు చేతులూ ఒకదానితో ఒకటి పోటీపడ్డాయి

నాగమ్మ రెండు కళ్ళూ ఒకదానితో ఒకటి కలబడ్డాయి

పరిష్కారం ? వేర్పాటు -- పంపకం

నాలుగు నిట్టాళ్ల కొట్టం చెరీసగమయ్యింది

రెండెకరాల మెట్టచేనూ చెరో ఎకరమయ్యింది

ఉన్న రెండు బర్రెలు చెరొకటయ్యాయి

ఆస్తులు పంచుకున్నారు అప్పులూ పంచు కున్నారు ఇహ మిగిలింది- ఆ ఆస్తులకూ, అప్పులకూ అవి పంచుకుంటున్న కొడుకుల అస్తిత్వాలకు కారణభూతులయిన ముసలి తల్లిదండ్రులు

'ఏరా సుబ్బడూ ! నువ్వు పెద్దోడివి—మీ అమ్మ మీ నాన్నను నీ దగ్గరుంచుకో — లోకంలో అది పద్ధతి కూడా' పెద్దిరెడ్డి చెప్పాడు.

'రెడ్డిగోరూ ! మీరు గట్లంటె నే సచ్చిపోతా. ముసలాల్లనిద్దర్నీ ఒక్కల్లే సాకటం మా బీదముండా కొడుకులకి కానిపని. చెరొకర్ని యిప్పించండి.'

నారాయణకు యిందాకటి బర్రెల పంపకం గుర్తొచ్చింది కళ్లు తుడుచుకున్నాడు.

'మరట్లాగయితే నాను ముసల్దాన్ని తీసు కుంటా—' చిన్నకొడుకు రామలింగడన్నాడు. నాగమ్మ దీనంగా నారాయణకేసి చూసింది. నాగమ్మను చూపులతోనే ఓదార్చాడు.

నాగసుబ్బడు చిన్నోడి మాటకు షాక్ తిన్నాడు. తన నోటిముందటి కబళం తన్నుకుపోతున్న గద్దవంక చూసినట్లు ఓ చూపు చిన్నోడివైపు చూసి అంతలోనే సర్దుకున్నాడు.

'అద్గాదు రెడ్డిగోరూ ! మా ముసలాడికి సిన్నాడంటే శానాశానా యిట్టం. అందుకే ముసలాన్ని సిన్నాడికిచ్చి —'

'నేనొల్ల —' పెద్దోడిమాట కడ్డుతగులుతూ చిన్నోడు ఖరాఖండిగా చెప్పేశాడు

'నాకు ముసల్దే —'

'నాకు ముసల్దే —'

'నాకు ముసలాడక్కర్లా —'

'నాకు ముసలాడక్కర్లా —'

ఇక దుఃఖమాపుకోలేక నారాయణ బిగ్గరగా ఏడ్పు ప్రారంభించాడు. నాగమ్మా యేడుస్తోంది నోటికి పైటకొంగడ్డం పెట్టుకొని. కదల్లేని తన కాలువంక చూసుకుంటూ నారాయణ ఏడుస్తున్నాడు తను అవిటోడు — పనిచేసే కాలు చెయ్యి లేకుండా— కేవలం తినే నోరూ, కడుపూ వున్నోడు.

ఆ సంసారాన్ని ఆ స్థితికి తెచ్చిన నారాయణ యిప్పుడెవ్వరికీ అక్కర్లేని 'అవిటోడు'.

'ఇగో ఈ ముసలోడు మీ యిద్దర్కీ అక్కర్లేక పోతే — కుసింత యిసమిచ్చి సంపెయ్యండిరా — దీన్ని నన్ను యిద్దర్నీ పీకపిసికి సంపెయ్యండి —' నారాయణ హృదయం భగ్గున మండింది.

'నారాయణా ! నువ్వూరుకో' పెద్దరెడ్డి చెపుతున్నాడు 'ఒరేయ్ ! ఇద్దరూ వద్దువద్దంటే ఆ ముసలోడెక్కడికి పోతాడు ? ముసలోడక్కర లేనపుడు వాడు సంపాదించింది మీకెందుకురా .'

కొడుకులు ముఖాలు చూసుకున్నారు

'అందుకనే నేనో పద్ధతి చెపురా వినండి .. మళ్లీ వచ్చే మీ పండుగ దాకా ముసలాడు పెద్దోడి దగ్గరా, ముసల్ది చిన్నోడి దగ్గర వుంటారు. పండుగ నుండి ముసలాల్లను మార్చుకోండి — ఎలాగుంది ఈ ఏర్పాటు ?'

రమణయ్య ముత్యాలశెట్టి బాగుందన్నారు

'న్యాయం' వెంటనే అమలు జరిగింది.

అదిగో మళ్లీ క్రిస్మస్ రాబోతోంది. . .

కోడి మళ్లీ కూసింది

నారాయణ బీడి ముట్టించుకున్నాడు. ఊళ్లోని దేవాలయంలో సుప్రభాతం వినపడుతోంది. వాడ మెల్లగా మేల్కొంటూంది.

నారాయణ మనసులో ఏవో కొత్త ఆలోచనలు కలుగుతున్నాయి దారపు పోగు కన్నా బలహీన మయిన మమతల బంధాలు తెగిపోతున్నాయి. నిర్లిప్తత... ఏదో వైరాగ్యం...

రాములోరి గుడిదగ్గర పిచ్చి సన్యాసి పక్కీరయ్య పాడుతున్నాడు.

యెవరు కొడు కెవరు కోడ

లెవరికెవరు గురుడా!!

కాలుసేతులుంటేనూ

మింగ మెతుకు గురుడా!!

రెక్కలిరిగి కూలబడితె

గంజి కరువు గురుడా !!

ఆ పాట నారాయణ గుండెల్లోకి సూటిగా దూకుతోంది. అవును. పిచ్చివాడెంత నిజం చెప్పు తున్నాడు ?

పాట ఆగిపోయింది. తెల్లారింతర్వాత తెలిసింది —ఆ పాట శాశ్వతంగా ఆగిపోయిందని అందరూ పిచ్చి వాడనుకుంటున్న పక్కీరయ్య నిజానికి పిచ్చివాడు కాదు. ఆ నిజం నారాయణలాంటి వృద్ధులకు తప్ప యితరులకు తెలీదు మరి! పెళ్లాం చనిపోయి మనసు చలించిన పక్కీరయ్యకు, కొడుకుల కోడళ్ల ఆలనా పాలనా చూసి మతి చలించింది.

మనసు విరిచి, మతి చెడగొట్టి యింట్లో నుండి తన్ని తగలేశారు తనుకన్నవారు !

ఎందుకో మరి పక్కీరయ్య చావు నారాయణ కొత్త ఆలోచినలకు కావలసినంత బలమిచ్చింది. తని మనసులోనిమాట నాగమ్మకు చెప్పాడు మొదట ఆమె భయపడి వద్దన్నా— నారాయణ చెప్పే చేదు నిజాలకు— రాబోయే పరిణామాలకు బదులు చెప్ప టానికి తన దగ్గర జవాబు లేక మౌనం దాల్చింది

ప్రొద్దుటే నారాయణ కొడుకుల్ని, కోడళ్లను, చుట్టుప్రక్కల వాళ్లను పిలిచాడు. అందరూ ఆశ్చర్యంతో వచ్చారు. అంధోని పంతులుగారూ వచ్చారు.

'పంతులూ ! మడిసికి ఈ ముసలితనంకంటె మరోనరకం లేదు. రేపటి పండక్కి నానూ, ముసల్ది అటూయిటూ మారాలగందా . కానీ మేంమారం —'

జనం ఆశ్చర్యంగా వింటున్నారు.

'ఎందుకంటే మేమియ్యాలే పట్నమెల్లి పోతన్నం. మా బతుకులు మేం బతకలేకపోము అన్నిటికీ ఆ దేముడున్నాడు' నారాయణ కంఠం మమతానుబంధాలకు అతీతంగా వుంది.

ముసలివాళ్ల నిర్ణయం కొడుకులు, కోడళ్లకు సంతోషంగా వుంది. కానీ జనం కోసం పెద్ద కొడుకు మాటాడబోయాడు.

'పంతులూ ! అన్ని నోర్మూసుకోమను. ఇన్నాళ్లూ యింతయిదిగా సూసిందిసాలు . పదయే పోదాం.''

నాగమ్మ, నారాయణ చిన్న గుడ్డమూటతో కదిలారు. సంటిది, బుడ్డోడు ఒక్కసారిగా కాళ్ళు కావలించుకున్నారు. చిన్నపిల్లల్ని చూసి ఆ పండు హృదయాలు వెంటనే చెమ్మగిల్లాయి. మమకారం కాళ్లను కదలకుండా చేసింది.

'తాతో నీతో నేనొస్తా ' సంటిది ఏడుస్తోంది.

'నీ ఊపు సీరుస్తా ... యిట్రాయేముండా — ' పెద్దకోడలు కూతుర్ని లాగింది.

రెక్కలు విరిగిన పక్షులు ముందుకు కదిలాయి.

పంతులుగారు కన్నీళ్లతో అటే చూస్తున్నారు.

కన్నవాళ్ల నిరాదరణ కంటే భయంకరమయిన నరకం ప్రపంచంలో మరొకటుండదు కదా !

నారాయణ చేస్తున్న 'పని' తప్పని గట్టిగా వారించటానికి పంతులుగారి దగ్గర మాటలులేవు మరి ! అందుకే మౌనం వహించాడు. పైగా 'యిట్టివి' ఆ వాడకు కొత్తవి కూడా కాదు.

నారాయణ, నాగమ్మ కనుమరుగయ్యారు.

వాడలో జనం పక్కీరయ్య చావు గురించి,

దీపావళి కథలపై వ్యాసరచన పోటీలో మూడవ బహుమతి రు. 100 లు పొందిన వ్యాసం

# నైతికంగా పతనమైన వ్యవస్థ స్వరూపం!

ఏ కథకైనా సామాజిక స్పృహ అనేది చాలా అవసరం అలాంటి సామాజిక స్పృహ కలిగిన రచనలు అందరి మన్ననలందుకుంటాయనటానికి నిదర్శనం "ఉప్పులేని కూడు" కథ బహుమతి పొందిన కథలలో ఎన్నిక కావటం ఆ బహుమతి పొందిన కథలలో "ఉప్పులేని కూడు" కథకు అగ్ర తాంబూలమివ్వవచ్చునని నా అభిప్రాయం ఎందుకంటే మనం మన సామాజిక వ్యవస్థని కొన్ని నైతిక సిద్ధాంతాలపై ఆధారపడి నిర్మించుకున్నాం అలాంటి వ్యవస్థలో నైతిక విలువలు పతనమౌతున్న తీరు, వాటి ప్రాముఖ్యాన్ని వెంకటేశు పాత్రద్వారా కొడుకు నైతిక పతనానికి కించిత్తు కూడ బాధ పడని లింగన్నలాంటి వారికి రచయిత తన సహజ శైలిలో కనువిప్పు కలిగేలా చెప్పారు ఆఖరిలో నైతికంగా పతనమైన వ్యవస్థయొక్క స్వరూపాన్ని "ఉప్పులేని కూడు"తో పోల్చి చూపారు

ఇకపోతే బహుమతి పొందిన కథలలో రెండవ దానిగా "దూరం" కథను ఎన్నుకోవడమైనది. కారణం మన నిత్య జీవితంలో ప్రతి నిత్యం అనేక రూపాలలో దర్శనమిస్తున్న ఈ దూరాన్ని రచయిత చాలా సున్నితంగా, వివిధ కోణాల్లో కళ్లకుకట్టినట్లు చూపగలిగారు 'దూరాన్ని కాలంతో కూడా కొలవవచ్చును' అన్న మాటలను యిందుకు ఉదాహరణగా తీసుకోవచ్చు 'రీడరు'గారు తన ముఖాన్ని భిక్షగాడి మొహంలో చూసుకోవడం ద్వారా, మనిషికి, మనిషికి గల మధ్య దూరం ఎలాంటిదైనా 'ఆకలి'కి మాత్రం అలాంటి దూరం లేదని చెప్పగలిగారు.

సుజాత, మూర్తి లాంటి కపటం లేని సున్నిత మనస్కుల గురించి, భరద్వాజ లాంటి అధికార అహం గల వ్యక్తుల గురించి చెప్పటానికి తన శాయశక్తులా కృషి చేసి, సఫలీకృతులైనారు కాబట్టి మూడవ కథగా "మదర్పిత. తాంబూలాది" కథను ఎన్నుకోవడమైనది

'నాకు డాక్టరు దగ్గరకు తీసుకెళ్ళటానికి డబ్బుంటే యిదెందుకు చేస్తాను!' అని 'హసీనా' చేత అనిపించటం ద్వారా ప్రజలలో పాతుకుపోయిన కొన్ని మూఢ నమ్మకాలకు ఆర్థిక లోపం కూడా ఒక కారణమని చెప్పగలిగారు అదే కారణాన్ని బాలలు కూలీలుగా మారటానికి కూడా చూపించారు. కావున "హసీనా" కథకు నాల్గవ బహుమతిని యివ్వవచ్చును.

లక్షలాది నిరుద్యోగుల్లో ఒకడై, చావు – బ్రతుకుల మధ్య ఊగిసలాడిన "పిసరంత గుండె" కల శంకరం కథను ఐదవదిగాను, "నీ గుండె కార్చిన కన్నీళ్ళు" కథను ఆరవదిగాను ఎన్నుకోవచ్చును

**— తుమ్మల మోహనరావు**

---

ముసలాళ్ళ ప్రయాణం గురించి, వారం తిరక్కుండానే మరిచిపొయ్యారు.

మరిచిపోనిది ఆంథోని పంతులుగారు మాత్రమే!

*   *   *

రైల్వే స్టేషన్ .

సందడిగా, కోలాహలంగా వుంది

ఆంథోని పంతులుగారు, వారిభార్య బరువెక్కిన హృదయంలో, మూగవోయిన మనసుతో రైలు దిగారు. తలవంచుకుని గేటు దాటారు.

'అయ్యా! దరమం బాబూ ... అమ్మా! దరమం తల్లీ ...'

'అవిటివాన్ని బాబూ . దానం సెయ్యండయ్యా ...'

ఎక్కడో విన్నగొంతు – బాగా పరిచయమున్న గొంతు. తల వెనక్కితిప్పి చూశారు పంతులుగారు.

నారాయణ !!

పంతులుగారికి కాళ్ల క్రిందనేల కంపించినట్లయింది.

గడ్డం పెరిగి, తలమాసి, చిరుగులు కట్టుకొని, దీనంగా, జాలిగా అడుక్కుంటున్నాడు నారాయణ. ఆ దృశ్యంతో పంతులుగారి గుండెలు బరువెక్కాయి.

'నారాయణా !'

ఆ పిలుపుకు వులిక్కిపడి నారాయణ తలెత్తాడు.

ఎదురుగా పంతులుగారు !

అప్రయత్నంగా నారాయణ కళ్లు వర్షించాయి. గొంతు బొంగురు వోయింది. కానీ – అదంతా ఒక నిమిషం. నారాయణ తమాయించుకొని గుండె దిటవు పరుచుకున్నాడు.

ఇప్పుడు నారాయణ 'నా' అనేవారు లేని కుంటి భిక్షగాడు.

నారాయణ ముఖంమీద గడ్డం చాటున నవ్వు మెరిసింది.

'బావున్నారా పంతులూ...'

'ఆఁ. ' ఆంథోనికి ఏం మాట్లాడాలో, ఎలా మాట్లాడాలో తెలియటం లేదు.

'యాడనుంచొస్తున్నరు .. కొడుకుల్దగ్గర్నుంచా... మీకేటి పంతులూ అదురుట్టవంతులు... ముసలిపాయాన గుండెల దాచుకునే కొడుకులు ...'

సంవత్సర కాలంలో కొడుకుల, కోడళ్ల ఆదరణ, ఆప్యాయత పంతులుగారి మనసులో 'ముల్లులా' గుచ్చుకుంది.

ఈ లోకంలో రక్తసంబంధాలు లేవు – ఆర్థిక సంబంధాలు తప్ప !

నారాయణ పొగడ్తలకు జవాబుగా ఆంథోని జీవంలేని నవ్వు నవ్వాడు.

'నాగమ్మ యెక్కడికెళ్లింది' – భయం భయంగా ప్రశ్నించాడు.

నారాయణ కన్నీళ్లతో చెయ్యి పైకి చూపించాడు.

పంతులుగారి మనసు దేవినట్లయింది.

'మరి ఒక్కడివి యిక్కడెందుకు బాధలు పడతావు – మనవూరు వెడదాంరా –'

'నాకేటి పంతులూ ... అయిగున్నా ...' చిరునవ్వు నవ్వాడు.

ఆ చిరునవ్వు వెనుక దాగివున్న కన్నీళ్లను అర్థం చేసుకోలేనివాడు కాదు పంతులు. నారాయణ ఏదో అడగాలనుకుంటూ, అడగటం లేదన్న సంగతి పంతులుగారు గ్రహించారు.

'నీ కొడుకులు బాగున్నారు— పెద్దోడు అరెకరం పొలం కొన్నాడు— అన్నట్లు చిన్నోడికి ఈ మధ్య కొడుకు పుట్టాడు—'

తనను కాదన్న కొడుకుల యోగక్షేమాలు వింటున్న నారాయణ మనసులో సంబరం.

'ఇగో పంతులూ! ఈ అయిదు రూపాయలెట్టి, మా సంటేదానికి, బుడ్డోడికి లడ్డుండలు కొనుక్కెళ్ళు—' నారాయణ కళ్లముందు పిల్లలు మెదిలారు,

వెలుగు తగ్గిన ఆ కళ్లల్లో మమతల కన్నీటితెర కదిలింది.

పంతులు వద్దంటున్నా నలిగిన ఐదురూపాయల నోటును గుప్పిటలో మూశాడు నారాయణ. ఎంతగా ఆపుకుందామనుకున్నా ఆంథోని పంతులుకు కన్నీరు ఆగలేదు.

పండిన ఆ మనసుకు తెలుసు మరో పండు మనసులోని మమతల వ్యథ !

పంతులు, వారి భార్య రిక్షా యెక్కారు.

పంతులు నారాయణకు డబ్బిద్దామనుకున్నాడు గాని— తత్త్వం తెలిసి ఆ ప్రయత్నం చెయ్యలేదు.

రిక్షా కదిలింది. తిరిగి స్టేషనువైపుచూశాడు.

నారాయణ అందరి ముందు చేయి చాస్తూ దీనంగా అడుక్కుంటున్నాడు. ఆ చెయ్యి—

హలంపట్టి పొలందున్ని బంగారం పండించిన చెయ్యి!

మట్టిని త్రవ్వి మాణిక్యాల్ని వెలికి తీసినచెయ్యి!

నాలుగు మెతుకుల్లో రెండు మెతుకుల్ని అన్నార్తుల కందించిన చెయ్యి !

ఆ క్షణంలో ఎందుకో తన కొడుకులు మనసులో మెదిలారు పంతులుగారికి.

ప్రభుత్వం వారిచ్చే పింఛనూ, నాలుగు ట్యూషన్లు చెప్పుకునే ఓపికా లేకపోతే... పోతే... తనూ...తన భార్య...ఈ జీవనసంధ్యాసమయంలో... ఆపైన ఊహించలేక కళ్లు మూసుకున్నాడు.

ఆ కళ్లనిండా కన్నీళ్లు.

ఆ కన్నీళ్లచాటున కనుమరుగవుతున్న నారాయణ రూపం...

ఇంకా అలాటలాటి ఎన్నో రూపాలు...

గతుకుల రోడ్డులో పాత రిక్షా మెల్లగా పోతోంది. ★